

ఆలు సాగుకు..
ఆలుగడ్డ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త రాహుల్ అన్నారు. 8లో▸



గంజాయి పట్టివేత
గట్టు చప్పుడు కాకుండా రైలులో గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. 8లో▸



పార్టీ బలోపేతానికి కృషి
బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

తట్టెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలి

శాసన సభలో ప్రస్తావించిన తాండూరు ఎమ్మెల్యే బీఎంఆర్



తాండూరు: తాండూరు నియజకవర్గంలో తట్టెపల్లి మండలంగా ఏర్పాటు చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంగళవారం శాసనసభలో ప్రస్తావించారు. ఉదయం సెషన్‌లో రెవెన్యూ శాఖ చర్చ కొనసాగుతుండగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవకర్గంలోని పెద్దేముల్ మండల పరిధిలో ఉన్న తట్టెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు ఎన్నో రోజులు రిలే దీక్షలు చేశారు. ప్రజల అభీష్టం మేరకు తట్టెపల్లిని మండలంగా మార్చాలని రెవెన్యూ శాఖ మంత్రి కోరుతున్నానని అన్నారు. తట్టెపల్లి మండలంగా మార్చేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు.

మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

అనంతగిరి: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళ శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్లు ఇస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారి హన్మంతురావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ నెల 31 వరకు ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారిస్‌లు ఆన్‌లైన్‌లో టీజీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ హార్డు కాపీని కలెక్టరేట్ ఆవరణలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. వివరాలకు 7993357103 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 18–55 ఏళ్ల మధ్యనున్న మహిళలు తెల్లరేషన్ కార్డుతో పాటుగా గ్రామీణ ప్రాంతం వారు రూ.1.50లక్షలు, పట్టణాల వారికి రూ.2లక్షల లోపు మించకుండా ఆదాయ ధృవపత్రం ఉండాలన్నారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి టైలరింగ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఐదవ తరగతి కనీస విద్యార్హత ఉండాలని సూచించారు.

పెన్షన్.. సేవలకు చెల్లింపు

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు



పెన్షనర్లను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు

అనంతగిరి: పెన్షన్ బహుమానం కాదని.. గతంలో అందించిన సేవలకు చెల్లింపని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు అన్నారు. మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లోని శ్రీసత్యసాయి జ్ఞాన కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. ధరం స్వరూప్ నకార పెన్షనర్ల ఆత్మగౌరవానికి పోరాడిన మహనీయుడు అన్నారు. విశ్రాంత ఉద్యోగులు కుటుంబానికి తాళం చెవిలాంటి వారన్నారు. పెన్షనర్లకు కాకిలాంటి కలుపుగోలుతనం, భగవంతుడిపై ఏకాగ్రత, తగినంత ఆహారం తదితర లక్షణాలు ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా 73 సంవత్సరాలు నిండిన పదిమంది పెన్షనర్లకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ సంఘం ప్రతినిధులు బెంజిమెన్, బందెప్పగౌడ్, శ్రీహరి, కిష్టయ్య, సతీష్‌చంద్ర, విజయరావు, విఠోబా, అలీమోద్దీన్, మొగులయ్య, జనార్దన్, సాయన్న, మనోహర్, విద్యాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు వేతనాలు మంజూరు చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీటీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ.. ఉద్యోగాల్లో చేరి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. కొత్త జీతం అందుకునే ఆనందానికి దూరమయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కిషన్‌నాయక్, ఇతర నాయకులు శంకర్ నాయక్, బొడ్డుపల్లి రాములయ్య, జహీర్ అజాద్, జె.కృష్ణ, పబ్బతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనంత వనం వ్యర్థాలు ఘనం

చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుషులు, మూగజీవాలతో పాటుగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. దీని నివారణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. అనంతగిరుల్లో వ్యర్థాలు పేరుకుపోయి పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

అనంతగిరి కొండలు, అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్రకటనల్లోనే ప్లాస్టిక్ నిషేధం

- ఇష్టానుసారంగా తినుబండారాలు పడేస్తున్న పర్యాటకులు
- వీధికుక్కల స్వైర విహారం
- వన్యప్రాణులను వేటాడుతున్న కుక్కలు
- పట్టించుకోని అటవీ, దేవాదాయ శాఖలు

వికారాబాద్: జిల్లా కేంద్రానికి తలమానికమైన అనంతగిరుల్లో యథేచ్ఛగా పర్యావరణ హనన జరుగుతోంది. రకరకాల పక్షిజాతులు, వన్యప్రాణులు, వందల సంఖ్యలో ఔషధ మొక్కలుండే అనంతగిరులు చెత్తా చెదారంతో నిండిపోతున్నాయి. గుట్టపై కొలువున్న అనంత పద్మనాభ స్వామి ఆలయ పరిసరాలతో పాటు గుట్ట పరిసరాల్లో ప్లాస్టిక్, చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా పడవేస్తున్నారు. అక్కడక్కడ పోగైన చెత్త సైతం అటవీ ప్రాంతంలోనే పడేస్తున్నారు. చెత్త, పర్యాటకులు పడేస్తున్న ఇతర వ్యర్థాలు, తినుబండారాల కోసం ఆ ప్రాంతంలో కుక్కలు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ఇవి దుప్పులను వేటాడుతున్నాయి. దీంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. అటవీశాఖ అధికారులు నిద్రావస్థలో ఉండగా.. దేవాదాయశాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

ఔషధ వనం.. కాలుష్యమయం

ఔషధ వనంగా పిలిచే అనంతగిరులు ప్రత్యేకతలకు నిలయం. కోకిల కూతలతో అలరించే వందలాది పక్షి జాతులు, దట్టమైన అటవీ ప్రాంతం నుంచి పొంగిపొర్లే జలపాతాలు అనంతగిరుల సొంతం. వందల మీటర్ల పొడవుగల నేచురల్ ట్రెక్కింగులు.. సుగంధాలను వెదజల్లే వందలాది జాతుల ఔషధ మొక్కలకు అనంతగిరులు పుట్టినిల్లు. ఔషధ వైద్యుల రీసెర్చ్ కేంద్రంగా విరాజిల్లుతుండడం గర్వకారణం. దుప్పి, దున్న, హైనా, కొండ గొర్రెలు లాంటి జంతుజాతులు అనంతగిరుల సొంతం. జిల్లాలో అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా.. 94 బ్లాకులుగా విభజించగా ఇందులో అనంతగిరి ప్రాంతంలోని అడవి ప్రధానమైనదిగా చెబుతారు.

అవగాహన కల్పనలో అధికారులు విఫలం

వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని అనంతగిరి అడవులను ఔషధ వనంగా పిలుస్తారు. ఇక్కడ సహజసిద్ధంగా పెరిగిన 300 రకాల ఔషధ మొక్కలున్నాయి. ఫారెస్టు అధికారులు మరో 18 రకాలకు చెందిన 50 వేల ఔషధ మొక్కలు నాటి పెంచుతున్నారు. అనంతగిరి అడవులు, కొండలు ఔషధ వైద్యులకు రీసెర్చ్ కేంద్రంగా ఉపయోగపడుతుంది. ఔషధ వైద్యులు, విద్యార్థులు ఔషధ మొక్కల పరిశోధనకు ఇక్కడికి వస్తుంటారు. అధికారులు కాలుష్యమయం కాకుండా, చెత్తా చెదారం పడేయకుండా ప్లాస్టిక్, తినుబండారాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా అధికారులు పర్యాటకులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

అందరి సహకారం అవసరం



సహజ సిద్ధమైన వాతావరణం కలిగిన అనంతగిరులను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరం. సహజసిద్ధంగా ఏర్పడిన వనరులకు ఎలాంటి నష్టం కలగకుండా కొండలు, అడవుల అందాలను మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. జంతువులు, పక్షుల రక్షణకు నీటి కొలనులు ఏర్పాటు చేశాం. నీటి అవసరాలు తీర్చేందుకు నాలుగు చోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. ప్లాస్టిక్ వాడకం నిషేధించాం. ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు పర్యాటకులు సైతం సహకరించాలి. ప్లాస్టిక్ నిషేధించేందుకు దేవాదాయ శాఖ అధికారులతో కలిసి కృషి చేస్తాం.

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారి

రైతులను విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

అనంతగిరి: లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీనాయకులతో కలిసి ఆనంద్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె నొప్పితో బాధపడుతున్న రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను విడుదల చేసి వారిపై కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులను విడుదల చేసేంతవరకు బీఆర్‌ఎస్ పోరాడాతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, పాండు, గయాజ్, గఫార్, మైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, అశోక్, లక్ష్మణ్, మల్లేశం సురేశ్, రాజేందర్‌గౌడ్, మల్లికార్జున్, కృష్ణ, సంగమేశ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం:మహేశ్‌రెడ్డి



పరిగి: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రైతులకు బేడీలు వేసి అరెస్టులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ పిలుపు మేరకు పార్టీ నాయకులు మంగళవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జైలులో గుండె నొప్పితో బాధపడుతున్న రైతుకు బేడీలు వేసి తీవ్రవాదిలా ఆస్పత్రికి తీసుకెళ్లడం సరికాదన్నారు. రైతులను దోషులుగా చిత్రీకరించి జైలుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన పోరాడుతున్న బీఆర్‌ఎస్‌పై పెట్టే అక్రమ కేసులకు తలొగ్గేది లేదన్నారు. రైతులపై అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రాజేందర్, రవికుమార్, సునంద తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

పట్టువిడవని ఎస్‌ఎస్‌ఏలు

12వ రోజుకు చేరిన సమ్మె

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరింది. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదట చేపట్టిన సమ్మెలో భాగంగా బీజేఆర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యా నాయక్ మాట్లాడుతూ 2023లో తాము సమ్మె చేస్తున్న సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులర్ చేయాలన్నారు. విద్యాశాఖలోని అన్ని విభాగాల్లో కీలకంగా పనిచేస్తూ విద్యా వ్యవస్థ విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన గత 21 ఏళ్లుగా విధులను నిర్వహిస్తున్నామన్నారు. స్వరాష్ట్రంలోనూ పదేళ్లుగా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా తమ ఊసెత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో పూర్తిగా విలీనం చేస్తూ ఉద్యోగులందరికి రెగ్యులర్ చేయాలని లేనిపక్షంలో పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఆయా విభాగాల ముఖ్య నాయకులు శేఖర్, రవికుమార్, ప్రభావతి, రాజేశ్వరి, స్వరూప, స్రవంతి, ఆశాలతా, మంగమ్మ, పల్లవి, శైలజ, రాధిక, వెంకట్‌రెడ్డి, రఘు, మోహన్, మీన, దశరథ్, రవి, చంద్రశేఖర్, విజయ్, వేణుగోపాల్, కృష్ణవేణి, జ్యోతి, ఇందిరా జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

చందానగర్: అవగాహనతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' (ప్రివెటింగ్ రిస్క్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కొలాబొరేషన్స్ అండ్ ట్రెనింగ్) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయనే మాట్లాడారు. 2016 నుంచి 2024 వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుమారు రూ.700 కోట్లు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఈ సంవత్సరం రూ.74 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ వారియర్స్, ఎస్సీఎస్సీ, సంగమిత్ర, దిల్‌సే వివిధ స్వచ్ఛంద సంస్థల వలంటీర్లతో ఈ నెల 18 నుంచి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' పోస్టర్, వలంటీర్ల ప్రొటెక్ట్ టీ షర్టులను ఆవిష్కరించారు. సైబర్ క్రైం డీసీపీ శ్రీబాల, ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, సీఈఓ నవీద్ ఖాన్, ఉమెన్ అండ్ చైల్డ్ భద్రత వింగ్ డీసీపీ సృజన, మాదాపూర్ డీసీపీ వినీత్, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, చంద్రకాంత్, సైబర్ ఎక్స్‌పర్ట్ ప్రవీణ్ తంగళ, భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవినాష్ మహంతి తదితరులు

మౌలిక వసతులపై దృష్టి సారించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: అన్ని ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులు, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని మేజర్, మైనర్ రిపేర్ పనులు, తాగునీరు, టాయిలెట్స్, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయించాలన్నారు. మీరు ఇచ్చే అంచనాల ప్రకారం నిధులు మంజూరు చేస్తామన్నారు. పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రిపేర్లకు ముందు తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. భోజనంలో మెనూ తప్పక పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా హాస్టల్స్‌లో ఉండే సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ అధికారులు, సంబంధిత వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలు నుంచి కమిషనర్లు, ఎంపీడీఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పారపొట్లకు తావివ్వకుండా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ మొబైల్ యాప్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది? రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు? సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు? ఆన్‌లైన్‌లో ఎన్ని వివరాలను అప్‌లోడ్ చేశారని అధికారులను వివరాలు అడిగి వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివసిస్తున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే వారి వివరాలను సైతం యాప్‌లో పొందుపర్చాలని చెప్పారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు ప్రతీ నెల రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కాక అప్పులు చేసి వంట చేస్తున్నామని వాపోతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతీ పాఠశాలకు గ్యాస్ సిలిండ్ ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్లమ్మ, సాజిదా బేగం, లక్ష్మి, నారాయణమ్మ, సతీమ్మ, ఆశమ్మ, అంజమ్మ, జంగమ్మ, వెంకటమ్మ, కృష్ణ, ఖాసీంబీ, మాలన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

'ఇస్తేమా'కు ఏర్పాట్లు చేయండి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

శంకర్‌పల్లి: పట్టణంలో వచ్చేనెల 3,4,5 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే 'ఇస్తేమా' కార్యక్రమం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శంకర్‌పల్లిలో ఇస్తేమా జరిగే ప్రదేశాన్ని మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులు, పోలీసులు, ముస్లిం పెద్దలతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇస్తేమా కోసం రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల్లో ముస్లింలు వస్తారని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ మానిటరింగ్ చేస్తారని తెలిపారు. విద్యుత్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూ, రోడ్లుభవనాలు, పోలీసు అన్ని విభాగాలు సమన్వయం చేసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన అంచనాల నివేదికలను అందిస్తే నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈనెల 25వ తేదీలోపు ఏరాట్లు పూర్తి చేసి, 31వ తేదీ వరకు ట్రయల్ ప్రారంభించాలని ఆదేశించారు. ఈనెల 25 తర్వాత మళ్లీ వచ్చి పరిశీలించనున్నట్లు చెప్పారు. సమావేశంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రెసిడెంట్ ఫహీముద్దీన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ని పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

క్లుప్తంగా

శాంతిభద్రతల్లో నిర్లక్ష్యం వహించొద్దు

డీఎస్పీ శ్రీనివాస్



డీఎస్పీ శ్రీనివాస్‌కు మొక్కను బహూకరిస్తున్న సీఐ, ఎస్‌ఐ

దోమ: శాంతి భద్రతల్లో పోలీసులు ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దోమ పోలీస్‌స్టేషన్‌ను సీఐ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎస్‌ఐ ఆనంద్‌ను అడిగి కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలతో మమేకమవుతూ శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డిలకు ఎస్‌ఐ ఆనంద్ మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ బోరు ధ్వంసం



పగిలిన బోరు స్టార్టర్

దుద్యాల్: గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బోరు మోటారును ధ్వంసం చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల్ గ్రామానికి నీరు అందించేందుకు శివాలయం దగ్గర ఉన్న దేవుని చెరువులో ప్రభుత్వ బోరు ఉంది. గ్రామానికి చెందిన తలారి నవీన్ బోరు మా భూమిలో ఉందని ఆరోపించాడు. బోరు స్టార్టర్, కేసింగ్ పైపును ధ్వంసం చేశాడు. గమనించిన పంచాయతీ కార్యదర్శి సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొంరాస్‌పేట్ ఎస్‌ఐ రవూఫ్ విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

షాద్‌నగర్ వైన్స్‌లో చోరీ

రూ. 5వేలు, 20వేల విలువగల మద్యం బాటిళ్లు అపహరణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో బైపాస్ రోడ్డులోని లక్కీ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ యజమాని కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వైన్స్ దుకాణాన్ని రోజుమాదిరిగా మూసివేసి వెళ్లారన్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో వైన్ షాపు వెనక నుంచి తలుపులు గడ్డపారతో పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి చొరబడ్డారన్నారు. అక్కడ కౌంటర్‌లోని రూ.5వేలతో పాటు సుమారు రూ. 20వేల విలువ గల మద్యం బాటిళ్లు, సీసీ కెమెరాల హార్డు డిస్కును కూడా దొంగిలించినట్లు ఆయన వివరించారు. ఈ విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కృష్ణ పేర్కొన్నారు.

అల్పాహారం.. అందనంత దూరం!

పేద విద్యార్థులకు ఆకలి మంటలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు అల్పాహార పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కానీ ఈ పథకానికి సరిపడా నిధులు కేటాయించడంలో యంత్రాంగం విఫలమవ్వడంతో చిన్నారులకు అర్ధాకలి బాధ తప్పడం లేదు.

- ప్రభుత్వ పాఠశాలల్లో అందని టిఫిన్
- బిల్లులు రాక నిలిపివేసిన నిర్వాహకులు
- అర్ధాకలితో చదువుకుంటున్న విద్యార్థులు
- పదో తరగతి వారికి కొనసాగుతున్న స్టడీ హవర్స్



బొంపల్లిలో అల్పాహారం తింటున్న విద్యార్థినులు (ఫైల్)

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక తరగతులతో పాటు వంద శాతం హాజరుశాతం పెంచేందుకు అల్పాహార పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకొచ్చింది. గతేడాది దసరా కానుకగా గత ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలులోకి తీసుకువచ్చింది. అయితే సర్కారు బడుల్లో ఎక్కువగా నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నారన్న నేపథ్యంలో గత ప్రభుత్వం ఒకటో నుంచి పదో తరగతి వరకు ఈ పథకం అమలులోకి తీసుకువచ్చింది. చాలా మంది పిల్లలు దూర గ్రామాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ఉండగా.. అల్పాహారం ఎంతో దోహదపడింది. కానీ పథకం ప్రారంభమైనప్పటికీ నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. జులై, ఆగస్టు నెల వరకు అల్పాహారం కొనసాగించి ఆ తరువాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

బిల్లులు రాకపోవడంతోనే..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 174 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. అందులో 12,486 మంది విద్యార్థులు పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అల్పాహార కార్యక్రమాన్ని పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు 45 నిమిషాల ముందుగానే అందించేవారు. సోమవారం ఇడ్లీ సాంబర్, లేదా గోధుమరవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం పూరి, ఆలుకుర్మా లేదా టమాటబాత్, సాంబర్, బుధవారం ఉప్మాసాంబర్ లేదా బియ్యంరవ్వకిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబర్, లేదా పొంగల్, సాంబర్, శుక్రవారం ఉగ్గని, అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ, లేదా బియ్యంరవ్వకిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబర్ లేదా కూరగాయాల పూలావ్, పెరుగు చట్నీ, ఆలు కుర్మాలో మెనూగా పొందుపర్చి విద్యార్థులకు అందించేవారు. కానీ బిల్లులు సక్రమంగా రాకపోవడంతో నిర్వాహకులు నిలిపివేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

దోమ మండల వ్యాప్తంగా 71 పాఠశాలలు ఉండగా అందులో 10 ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలు, ఓ కేజీబీవీ ఉన్నాయి. వీటిలో మొత్తం 5,221 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అల్పాహారం ప్రారంభించినప్పటికీ బిల్లులు సక్రమంగా రాకపోవడంతోనే నిర్వాహకులు వాటిని నిలిపివేశారు. మరోపక్క జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థల దాతృత్వంతో పలు పాఠశాలల్లో అల్పాహార పథకం కొనసాగుతుండడం గమనార్హం.

నిరాశలో చిన్నారులు

పదో తరగతి విద్యార్థులు ఉదయం పాఠశాలకు ముందుగానే వస్తుండడంతో పాటు సాయంత్రం ఇంటికి ఆలస్యంగా వెళ్తుంటారు. దోమ మండల వ్యాప్తంగా 422 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఉదయం అల్పాహారం, సాయంత్రం కనీసం స్నాక్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ ప్రత్యేక నిధులు కేటాయించి స్నాక్స్ అందించేది. కానీ ప్రస్తుతం స్నాక్స్‌తో పాటు అల్పాహారం సైతం నిలిపివేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అటు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో చిన్నారులు నైరాశ్యానికి గురవుతున్నారు.

అల్పాహారం అందించాలి



పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తే ఎంతో మేలు జరుగుతుంది. కనీసం స్నాక్స్ అయినా అందించాలి. పాఠశాలలో సాయంకాలం లేట్ అవుతుండడంతో అర్ధాకలితో చదువుకోవాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని అల్పాహారం, స్నాక్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి.

– హారిక, పదో తరగతి విద్యార్థిని, కిష్టాపూర్

దాతలు స్పందించాలి



నిర్వాహకులకు బిల్లులు రాక అల్పాహార పథకం నిలిపివేశారు. మండలంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. దాతలు ముందుకు వస్తే స్నాక్స్, అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. తమ వంతుగా పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటికి వరకు స్పష్టత రాలేదు.

– వెంకట్, ఎంఈఓ, దోమ

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాంతాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రస్తావించడంపై సేవాలాల్ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న తట్టెపల్లి ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కావున ప్రత్యేక మండలం ఏర్పాటు చేస్తే అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని సురేష్ అభిప్రా యపడ్డారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

పరిగి: ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని నర్సయ్యగూడ గేటు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఖుదావన్‌పూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్(41), కుల్కచర్ల మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజయ్య బైక్‌పై పరిగి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో నర్సయ్యగూడ గేట్ సమీపంలో పరిగి నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆంజనేయులుగౌడ్ కాళ్లమీదుగా బస్సు చక్రాలు పోయి నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు సైతం తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆంజనేయులుగౌడ్ అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. అంజయ్యను మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆలు సాగుకు యాజమాన్య పద్ధతులు అవసరం

డాట్ సెంటర్ శాస్త్రవేత్త రాహుల్



మోమిన్‌పేటలో ఆలుగడ్డ పొలాన్ని పరిశీలిస్తున్న రాహుల్ తదితరులు

మోమిన్‌పేట: ఆలుగడ్డ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్త రాహుల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు అంగేరి మోహన్‌రెడ్డి ఆలుగడ్డ పొలాన్ని డాట్ (జోగిపేట) కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలు సాగుకు చలికాలం అనుకూలమైందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలున్నందున నీటి తడులు ఇవ్వొద్దని సూచించారు. ఎరువులు, మందుల పిచికారీ సరైన సమయంలో చేయడంతో దిగుబడులు బాగా వస్తాయర్కొన్నారు. రైతులు పొలాన్ని లోతుగా దున్నుకుని తేమ లేకుండా ఉన్నప్పుడే విత్తనం విత్తుకోవాలన్నారు. భూమిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు విత్తుకొంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆయన వెంట ఏఈఓలు పెంటయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

28 కిలోల గంజాయి పట్టివేత

రూ.7 లక్షల విలువ ఉంటుందని పోలీసుల వెల్లడి



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

అనంతగిరి: గట్టు చప్పుడు కాకుండా రైలులో గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపారు. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వికారాబాద్ ఎక్సైజ్ పోలీసుల బృందం ఎల్‌టీటీ రైలులో(విశాఖపట్నం-ముంబాయి) సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ముంబైకి చెందిన జితేంద్ర మంజునాథ, ప్రతిభ అన్నప్ప మొగ్వేరాలకు చెందిన రెండు బ్యాగులను తనిఖీ చేయగా 28 కిలోల ఎండు గంజాయి లభ్యమయింది. దీంతో ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరూ ఆంధ్రా-ఒడిశా బార్డర్ ప్రాంతానికి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.7లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాస్, ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంట్రాక్టర్ చేతివాటంపై లేబర్ కమిషనర్ ఆగ్రహం

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కంపెనీ కాంట్రాక్టర్‌పై రీజినల్ లేబర్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీసీఐ యాజమాన్యంతో పాటు కాంట్రాక్టర్, కార్మిక సంఘం నాయకులతో రీజినల్ లేబర్ కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీసీఐలో పని చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఓ కాంట్రాక్టర్ 15 మంది కార్మికులకు బోనస్ ఇచ్చి.. 26 మందికి ఇచ్చినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించడంపై లేబర్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అదే విధంగా కార్మికులకు పీఎఫ్ చెల్లించకపోవడంతో సీసీఐ యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్లప్ప, వెంకటయ్య, దస్తప్ప తదితరులు ఉన్నారు.

పర్సు అప్పగింత

ఆమనగల్లు: బస్సులో పోగొట్టుకున్న పర్సును తిరిగి ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది.

పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం

రూ.1.65 కోట్లు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం వందకుపైగా ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వర్షాలు పడిన సందర్భంగా గోడలకు విద్యుత్ షాక్ సైతం సంభవించి విద్యార్థులు భయాందోళనకు గురి చేసిన సంగతి తెలిసిందే. ఈ సమస్యపై ‘సాక్షి’లో అనేకసార్లు ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కడా అధికారి వెంకట్ రెడ్డి స్పందించారు. కొత్త భవనం మంజూరుకు కృషి చేస్తామని ప్రకటించారు. మంగళవారం పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి పది గదులతో నూతన భవన నిర్మాణానికి పాఠశాల వెనుక స్థల పరిశీలన చేశారు. ఇందుకు రూ.1.65 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మరో 15 గదులు నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు చెప్పారు. మిగతా 15 గదులకు సంబంధించిన నిధులు కూడా అతి త్వరలో మంజూరయ్యే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పార్టీ గ్రామ అధ్యక్షుడు భీములు, నాయకులు నరేశ్, వెంకటయ్య, మైమూద్, కృష్ణ, గోపాల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, నాయకులు

బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్: తాండూరు సర్కిల్ రూరల్ సీఐగా నగేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి పరిగి సీఐగా వెళ్లారు. దీంతో సంగారెడ్డి డీసీఆర్‌డీ నుంచి తాండూరు రూరల్ సీఐగా నగేష్ వచ్చారు. నూతనంగా వచ్చిన సీఐను కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

ఠాణా సందర్శన



నగేష్ సీఐ

బషీరాబాద్: పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంచేలా కృషి చేస్తామని తాండూరు రూరల్ నూతన సీఐ వై.నగేష్ అన్నారు. మంగళవారం విధుల్లో చేరిన ఆయన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఎస్‌ఐ పి.శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. వివిధ కేసుల విషయంలో ఠాణాకు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని కల్పించేలా తాము పనిచేస్తామని స్పష్టం చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో

తాండూరు రూరల్: ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని బెల్కటూర్ రైల్వేగేట్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చిట్టిఘనాపూర్‌కు చెందిన సంజీవ్‌కుమార్, రవికుమార్ బైక్‌పై తాండూరులో జిమ్‌కు వెళ్తున్నారు. తాండూరు నుంచి కరన్‌కోట్‌కు కోళ్లను వేసుకు వెళ్తున్న బొలెరో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సంజీవ్‌కుమార్‌కు తీవ్రగాయాలవ్వగా.. రవికుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంజీవ్‌కుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పాస్ బుక్.. పరేషాన్!

- రిజిస్ట్రేషన్ అయినా అందని పట్టా పుస్తకాలు
- పత్రాల కోసం ఎదురుచూపులు
- ఎలాంటి స్పష్టతనివ్వని అధికారులు



పట్టా పాసు పుస్తకాలు

దౌల్తాబాద్: భూములు క్రయవిక్రయాలు చేసిన పట్టాదారులకు పాసుపుస్తకాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సబ్‌రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పట్టా చేసిన నిమిషాల వ్యవధిలోనే పాసు పుస్తకాలు అందజేస్తామని గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. వాటి బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించింది. గతంలో వారం, పదిహేను రోజుల్లో పట్టా పాసుపుస్తకాలు వచ్చేవి. కానీ గత మూడు నెలల నుంచి పట్టాలు చేసుకున్న పట్టాదారులకు సకాలంలో పాసుపుస్తకాలు రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మూడు నెలలుగా ఇబ్బంది

మండలంలో భూములు కొనుగోళ్లు చేసుకున్న పట్టాదారులు గత మూడు నెలల నుంచి సుమారు 300కుపైగా మంది ఉన్నట్లు సమాచారం. వీరికి పట్టా పాసు పుస్తకాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పాసు పుస్తకాల కోసం తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భూములు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న పట్టాదారులు నిత్యం పోస్ట్ సిబ్బందిని కలిసి పాసు పుస్తకాల కోసం ఆరా తీస్తున్నారు. మూడు నెలల నుంచి పాసుపుస్తకాలు అందకపోవడంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. పాసు పుస్తకాల కోసం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తున్నారు. అధికారులు సరైన సమాధానం చెప్పక మాట దాటవేస్తున్నారు. పాసు పుస్తకాలు నేరుగా పోస్ట్ ద్వారా ఇంటికి వస్తాయని చెబుతున్నా మూడు నెలల నుంచి రాకపోవడానికి కారణం ఏంటని ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమ పథకాలకు అడ్డంకి

భూములు కొనుగోలు చేసిన వారికి పాసు పుస్తకాలు రాకపోవడంతో సంక్షేమ పథకాలకు అడ్డంకిగా మారింది. పంట రుణాలు ఇతర దీర్ఘకాలిక రుణాలు, రైతు బీమా, రైతుభరోసా మార్టిగేజ్ రుణాలు పంటలు విక్రయించుకునేందుకు పాసుపుస్తకాలు లేక యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోస్టాఫీసులో అడగండి

మూడు నెలల నుంచి పాసుపుస్తకాలు అందలేకపోవడంపై పూర్తి సమాచారం లేదు. అయితే ఎవరైనా రైతులు పట్టా పాసుపుస్తకం వచ్చిందో లేదో స్థానిక పోస్టాఫీసులో అడగండి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో పరిష్కరిస్తాం.

– గాయత్రి, తహసీల్దారు, దౌల్తాబాద్



తాండూరు టౌన్: నిరశన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద..

లగచర్ల రైతులను విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు

లగచర్ల రైతులపై పెట్టిన కేసులు వెంటనే తొలగించి, వాళ్లను విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. భారత్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నేతలు ముఖ్య కూడళ్లలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఈ సందర్భంగా అమాయక రైతులపై పెట్టిన కేసులను ఎత్తేసి వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు నినదించారు.

– సాక్షి, నెట్‌వర్క్



దోమ: వినతిపత్రం అందజేసి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



పూడూరులో..



ధారూరు: అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నేతలు



బొంరాస్‌పేట: రేగడిమైలారంలో..



మర్పల్లి: బాబాసాహెబ్ విగ్రహం వద్ద..



మోమిన్‌పేట: వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు